క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మడికొండ: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ కాజీపేట మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్బన్ నాగరాజ్ ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ఇళ్లు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వస్కుల శంకర్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, వస్కుల పెద్దరాజు, బజ్జూరి శ్రీనివాస్, పసునూరి శ్రీనివాస్, కడమంచి సాయిలు, బైరపాక వేణు, బత్తుల సుమన్, బస్కే బాబు, ముంజ రమేష్, దండిగం సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల హసన్‌పర్తి శాఖ కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ హసన్‌పర్తి శాఖ అధ్యక్షుడిగా గొర్రె దినేష్, ఉపాధ్యక్షులుగా మట్టెడ రాము, ఇమ్మడి సిద్దు, ప్రధాన కార్యదర్శిగా సందెల ప్రశాంత్, కార్యదర్శిగా ఆకునూరి అక్కి, నందం, సహాయ కార్యదర్శిగా తాళ్ల రణధీర్, ప్రచార కార్యదర్శిగా సందెల సాయినాథ్, కోశాధికారి లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

ఎంఎస్ఎఫ్ కార్యవర్గం

ఎంఎస్ఎఫ్ హసన్‌పర్తి శాఖ అధ్యక్షుడిగా గడిపి అరవింద్, ప్రధాన కార్యదర్శిగా ఆరెపల్లి విప్లవ్, ఉపాధ్యక్షుడిగా సిద్దు, కార్యదర్శిగా మేకల సిద్దు, సహాయ కార్యదర్శిగా ఇమ్మడి సాత్విక్, కోశాధికారిగా చందును ఎన్నుకున్నారు.

ఎంఎస్పీ గ్రామశాఖ కమిటీ

ఎంఎస్పీ హసనపర్తి శాఖ అధ్యక్షుడిగా సిలువేరు స్వామి, ప్రధాన కార్యదర్శిగా సందెల చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా మచ్చ అయిలయ్య, కార్యదర్శిగా మేకల వినయ్, సహాయ కార్యదర్శిగా గొర్రె కుమార్, ప్రచార కార్యదర్శులుగా జలంధర్, సురేందర్, కోశాధికారిగా బోడ కుమార్, గౌరవ సలహాదారులుగా రమేష్, బోడ సాంబయ్య, మేకల కన్నయ్య, ఇమ్మడి దేవేందర్ ఎన్నికైనట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ఆరెపల్లి పవన్, కో ఇన్‌చార్జ్ రాజారపు భిక్షపతి వివరించారు.

మంత్రి వాకిటి శ్రీహరికి సన్మానం



హసన్‌పర్తి: రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మంత్రిని హైదరాబాద్‌లో మార్క్ విజయ్‌కుమార్, నారగోని కుమార్, వీసం సురేందర్‌రెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్ తిప్పర్తి రాఘవరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆవిర్భావం

న్యూశాయంపేట: అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 86వ ఆవిర్భావ దినోత్సవాన్ని వరంగల్ జిల్లాలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ హకీమ్ నవీద్, జిల్లా నాయకులు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారయత్నం

ఆత్మకూరు : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేయగా, సదరు వివాహిత ఆదివారం ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. వివాహిత శనివారం ఇంటి వద్ద బట్టలు ఉతుకుతుండగా ఒంటరిగా ఉండడం గమనించిన అక్కంపేటకు చెందిన కడుదుల దేవేందర్.. ఆమె చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇంట్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో ఆమె అరవడంతో కుటుంబ సభ్యులు, సమీపంలోని వ్యక్తులు రావడంతో అతడు పరారయ్యాడు. ఈ విషయంపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వన్య ప్రాణులను వేటాడడం నేరం

శాయంపేట : వన్య ప్రాణులను వేటాడడం నేరమని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ హనుమకొండ జిల్లా సభ్యుడు సునీల్ అన్నారు. ప్రగతిసింగారం గ్రామంలో చలివాగు బ్రిడ్జి పరిసర ప్రాంతంలో ఆదివారం ఇద్దరు వేటగాళ్లు పక్షులను వేటాడేందుకు ప్రయత్నిస్తుండగా వన్యప్రాణి ప్రేమికుడు విజేందర్‌తో కలిసి ఆయన అడ్డుకున్నాడు. అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వేటగాళ్ల నుంచి వేట సామగ్రిని స్వాధీనం చేసుకుని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చెరుకుపాలెం గ్రామాని చెందిన సానికొమ్ము బాబు, సానికొమ్ము రామాంజి గ్రామాల్లో సంచరిస్తూ పందులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేటగాళ్లకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

సాదాబైనామాకు నో చాన్స్?

- సీతంపేట, సీతానాగారం గ్రామాలకు వర్తించని పథకం
- నగర పరిధిలో ఉండడమే కారణం
- అవకాశం లేకున్నా దరఖాస్తుల స్వీకరణ
- ఆందోళనలో ప్రజలు, రైతులు

హసన్‌పర్తి: గ్రామాల్లో తెల్లకాగితంపై రాసుకొని కొనుగోలు చేసిన భూములకు సాదాబైనామా వర్తింపజేయాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నప్పటికీ హసన్‌పర్తి మండలంలోని రెండు గ్రామాలకు మాత్రం సాదాబైనామా వర్తించే పరిస్థితి లేదు. రెవెన్యూ పరిధిని పరిగణలోకి తీసుకోవడం వల్ల ఆ గ్రామాలకు శాపంగా మారింది. సాదాబైనామా వర్తించకపోవడం వల్ల అక్కడి ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నగర పరిధిలో ఉండడంతో..

12 ఏళ్ల క్రితం హసన్‌పర్తి మండలం 23 గ్రామాలుగా కొనసాగింది. అందులో 10గ్రామాలను నగరంలోని విలీనం చేశారు. హసన్‌పర్తి, ముచ్చర్లతో పాటు మరో ఎనిమిది గ్రామాలు నగరంలో విలీనమయ్యాయి. దీంతో వాటి సంఖ్య 13కు పరిమితమైంది. నగరంలో విలీనమైన హసన్‌పర్తి రెవెన్యూ పరిధిలోని సీతంపేట, ముచ్చర్ల రెవెన్యూ పరిధిలోని సీతానాగారాన్ని గ్రామంగానే కొనసాగించారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు నగర పరిధిలో ఉన్న భూములకు సాదాబైనామా వర్తించదని స్పష్టంగా పేర్కొంది. దీంతో సీతంపేట, సీతానాగారం గ్రామాల రెవెన్యూ పరిధి నగరంలో ఉండడంతో సమస్య తలెత్తింది.

అవకాశం లేకున్నా దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రెవెన్యూ పరిధి పరిగణలోకి వస్తోంది. దీంతో సీతానాగారం, సీతంపేట గ్రామాల్లో తెల్లకాగితంపై కొనుగోలు చేసిన రైతులకు అవకాశం లేకుండా పోయింది. రెవెన్యూ సదస్సుల సందర్భంగా సీతంపేటలో 76 మంది రైతులు, సీతానాగారంలో 70 మంది తెల్ల కాగితంపై భూములు కొనుగోలు చేసినట్లు దరఖాస్తు చేసుకున్నారు. తమకు సాదాబైనామా ద్వారా పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేయాలని కోరారు. అయితే, ఈ గ్రామాల్లో సాదాబైనామా వర్తించకపోయినప్పటికీ అధికారులు మాత్రం దరఖాస్తులు స్వీకరించారు.



సీతానాగారం గ్రామపంచాయతీ భవనం



సీతంపేట గ్రామపంచాయతీ

ఎందుకు దరఖాస్తులు తీసుకున్నారు



సాదాబైనామాకు అవకాశం లేనప్పుడు అధికారులు దరఖాస్తులు ఎందుకు తీసుకున్నారు. కేవలం రైతులను మభ్యపెట్టేందుకు యత్నించారు. రెవెన్యూ ప్రాంతం నగర పరిధిలో ఉన్నప్పటికీ గ్రామపంచాయతీగా కొనసాగుతోంది. గ్రామ పంచాయతీగా పరిగణలోకి తీసుకుని సాదాబైనామా వర్తింపజేయాలి.

– దావ రవి, మాజీ సర్పంచ్, సీతానాగారం

ప్రత్యేక జీఓ తీసుకురావాలి



రెవెన్యూ ప్రాంతం నగర పరిధిలోకి ఉన్నప్పటికీ పంచాయతీగానే కొనసాగుతున్న గ్రామాల్లో సాదాబైనామా కోసం ప్రత్యేక జీఓ తీసుకురావాలి. మా ప్రాంతంలో ఎకరానికి కోటి రూపాయలకు పైగా ధర పలుకుతోంది. సాదాబైనామా వర్తించకుంటే రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– డాక్టర్ చిర్ర తిరుపతి, రైతు, సీతంపేట

అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఖండించండి

వరంగల్ చౌరస్తా: ఇరాన్ దేశంపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ, పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని పోస్టర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.గోవర్ధన్ మాట్లాడారు. ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి అమెరికా చేస్తున్న దుర్మార్గపు దాడులను తమ పార్టీ ఖండిస్తోందని చెప్పారు. మధ్య పశ్చిమాసియా ప్రాంతాల్లో తమ ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి అమెరికా, పశ్చిమ యూరప్ సామ్రాజ్యవాద దేశాలు కలిసి కృత్రిమ ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటు చేశాయని ఆరోపించారు. ఆ దేశానికి ఆర్థిక, సైనిక, వైమానిక, అణు సాంకేతిక పరిజ్ఞానం సహకారం అందిస్తూ దాడులు చేయిస్తున్నాయని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, రాజేందర్, పౌర హక్కుల సంఘం నాయకుడు ప్రవీణ్, మానవ హక్కుల వేదిక నాయకుడు కోటేశ్వరరావు, పీడీఎం నాయకుడు క్రాంతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, పీవైఎల్ నాయకుడు హరిబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

‘కేంద్రం కక్ష సాధింపు చర్యలు’



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం బాధ్యుడు

వరంగల్ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం పెన్షనర్లపై కక్ష సాధింపు చర్యగా, ఆశానిపాతంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ కాశిబుగ్గ యూనిట్, వరంగల్ జిల్లా శాఖ ప్రతినిధులు అన్నారు. గిర్మాజీపేటలోని సరస్వతి విద్యానికేతన్‌లో తుమ్మ వీరయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను జాప్యం చేయకుండా త్వరగా మంజూరు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజయ్య, జిల్లాశాఖ బాధ్యులు ఎండీ.మదర్ సాహెబ్, కుమారస్వామి, రత్నం, డానియల్, కె.మధుసూదన్ రావు, జిల్లాశాఖ అధ్యక్షులు సుధీర్ బాబు, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకోవాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రంగయ్య

ఖిలా వరంగల్: కార్మిక హక్కులను కాపాడుకోవాలని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు సీహెచ్.రంగయ్య సూచించారు. వరంగల్ ఉర్సు గుట్ట వద్ద సీపీఎం జిల్లా కార్యాలయం రామ సురేందర్ భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా శిక్షణ తరగతులు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్రం విభజించిందని అన్నారు. అవి యజమాన్యానికి మేలు చేకూర్చే విధంగా, కార్మికులకు అన్యాయం చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. టోపిడీ – మూలాలు అనే అంశంపై సీఐటీయూ నాయకుడు టి.ఉప్పలయ్య ప్రసంగించారు. ఉసిల్ల కుమార్, వనదాసు దుర్గయ్య, మాదాసి దివ్య, ఇనుముల ఎలిషా, శ్రీనివాస్, మంద కిట్టు, జన్ను కిరణ్, బాబు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: పాత కక్షలతో దాడి చేసుకున్న ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ.మాషూక్‌బీతో పాటు ఆమె తమ్ముడిపై ఇమ్రాన్, అతని తండ్రి షఫీ కర్రలతో దాడి చేశాడు. ఇమ్రాన్‌పై సలీమ్, అనిఫ్ మరికొందరు కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో ఇరువురు పరస్పరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ వివరించారు.

బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: కాజీపేట మండలంలోని సోమిడిలోని మహాత్మా జ్యోతిరావు పూలే (బీసీ) మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం (2025 – 2026)లో డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 24న స్పాట్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.సునీత తెలిపారు. బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, బీజెడ్‌సీ, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ (ఇపీహెచ్) గ్రూపుల్లో అడ్మిషన్లు పొందాలని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థినులు స్పాట్ కౌన్సిలింగ్ ప్రక్రియకు హాజరై నేరుగా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. గురుకుల కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థినులకు ఉచిత నాణ్యమైన విద్య, వసతి, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పీజీ కోచింగ్ కూడా ఉంటుందని ప్రిన్సిపాల్ సునీత వివరించారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

వేలేరు : మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం నాశనమవుతుందని ఎస్సై అజ్మీరా సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, వరంగల్ సీపీ ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు తమవంతు సహకారం అందించాలని ఎస్సై సురేష్ కోరారు.

ఎత్తుకెళ్తే దొరికిపోతారు

- జీపీఎస్ వ్యవస్థతో చోరీల నియంత్రణ
- వాహనాలకు జీపీఎస్ ట్రాకర్‌తో దొంగతనాలకు చెక్





ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరం వరంగల్. ఇక్కడి నగర రహదారులపై రోజూ 2లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహన రద్దీ ఎక్కువగా ఉంటోంది. ట్రైసిటీలో ఎక్కడ చూసినా సరైన పార్కింగ్ స్థలాలు లేవు. వాహనం దూరంగా పెట్టి షాపింగ్ చేయాల్సి పరిస్థితి వచ్చింది. ఇలాంటి సమయంలో రోడ్డుపై పార్కు చేసిన వాహనానికి భద్రత కరువైంది. రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని దొంగలు వాహనాలను అపహరిస్తున్నారు. వాహనాన్ని విడి భాగాలుగా చేసి విక్రయిస్తున్నారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే క్షణాల్లో చోరీకి గురైన వాహనాలను పట్టుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడే జీపీఎస్ పరికరాన్ని బిగించుకుంటే చోరీకి గురైనా సులభంగా గుర్తించవచ్చు. వాహనంతో దొంగలు ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవచ్చని అధికారులు అంటున్నారు.

కంపెనీలను బట్టి ధరలు

జీపీఎస్ యంత్రాలు పలు కంపెనీల్లో లభ్యమవుతున్నాయి. కంపెనీ నాణ్యతను బట్టి ధరలు ఉన్నాయి. జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) ట్రాకర్ శాటిలైట్ సిగ్నల్స్ ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా వాహనం ఉన్న కచ్చితమైన స్థానాన్ని గుర్తిస్తుంది. దీన్ని వాహనంలో బయటకు కనిపించకుండా లోపల బిగించి బ్యాటరీకి అనుసంధానం చేస్తారు. ట్రాకర్‌ను అమర్చుకునేందుకు సుమారు రూ.1,500ల నుంచి రూ.5వేల వరకు ఖర్చవుతుంది. ఇందులోని సిమ్‌కార్డును రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ యాప్, వెబ్ ప్లాట్‌ఫామ్ ద్వారా వినియోగదారుడికి సమాచారం అందుతుంది.

ఫోన్‌కు హెచ్చరిక

జీపీఎస్ బిగించిన వాహనం చోరీకి గురైతే కచ్చితమైన స్థానాన్ని ప్రత్యక్షంగా (రియల్ టైమ్)లో చూపిస్తుంది. పార్కు చేసిన ప్రాంతం నుంచి కదిలిస్తే మొబైల్‌కు వెంటనే మెసేజ్ రూపంలో హెచ్చరిక వస్తుంది. వాహనం ఎక్కడికి వెళ్లిందో నమోదు చేస్తుంది. కొన్ని ట్రాకర్లతో ఉన్న చోటే వాహనాన్ని ఆపి వేయవచ్చని నిపుణులు అంటున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి

వాహనం చోరీకి గురైతే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. చోరీ స్థలం, సమయం, వాహనం మోడల్, రిజిస్ట్రేషన్ నంబర్, రంగు వంటి వివరాలు చెప్పాలి. జీపీఎస్ ట్రాకింగ్ సమాచారాన్ని పోలీసులకు అందించాలి. ఎఫ్ఐఆర్ కాపీ తీసుకుని వాహన బీమా సంస్థకు తెలియజేయాలి. జీపీఎస్ ట్రాకింగ్ వాడకంతో వరంగల్, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో వాహనాల చోరీలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



వరంగల్ నగర పరిధిలోని వ్యాపార సముదాయాల ఎదుట, ఇంటి ముందు సీసీ కెమెరాలు బిగించుకోవాలి. సీసీ కెమెరాలు ఇంటికి రక్షణగా నిలుస్తాయి. షాపులు, ఇంటి ఆవరణలో పార్కు చేసిన వాహనం చోరీకి గురైనా పట్టుకోవచ్చు. వాహనాలకు జీపీఎస్ ట్రాకర్లు బిగించుకుంటే రక్షణ ఉంటుంది. దొంగతనం జరిగినా తేలికగా వాహనాన్ని పట్టుకోవచ్చు.

– నందిరామ్ నాయక్, ఏసీపీ, వరంగల్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మడికొండ చౌరస్తాలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ కిషన్ సూచించారు. ఈ మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై మడికొండ చౌరస్తాలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. మత్తు పదార్థాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని చెప్పారు. ఎవరైన మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అలాంటి వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, ఏఎస్సై చంద్రమౌళి, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, రాంచందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

రామన్నపేట: డ్రగ్స్ మత్తులో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని మట్టెవాడ సబ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, శివకృష్ణ సూచించారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో రంగంపేటలో వివిధ హాస్టళ్లలో ఉంటున్న వారికి పలు అంశాలపై ఆదివారం అవగాహన కల్పించారు. కొంతమంది మానసిక ఆందోళనలు, అధైర్యంతో విచక్షణ కోల్పోయి మత్తు పదార్థాలకు అలవాటు పడి సైకోలుగా మారుతున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి ఒకవేళ దొరికితే విలవిలాడిపోతున్నారని అన్నారు. అలాంటి దుస్థితి తెచ్చుకోవద్దని సూచించారు.



రామన్నపేట: కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సైలు

మెడియేషన్ సెంటర్లతో పరిష్కారం

ఖిలా వరంగల్: మెడియేషన్ సెంటర్లతో ఇరుపక్షాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మెడియేషన్ సెంటర్ సభ్యుడు వడ్నాల నరేందర్ అన్నారు. వరంగల్ శంభునిపేటలో కమ్యూనిటీ మెడియేషన్ సెంటర్, యునైటెడ్ నేషన్స్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కమ్యూనిటీ మెడియేషన్ సెంటర్ల ప్రాధాన్యతపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఆ శాఖ కోఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వడ్నాల నరేందర్ మాట్లాడారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెడియేషన్ సెంటర్లు పనిచేస్తాయని అన్నారు. వివాదంలో ఉన్న రెండు పక్షాలు పరస్పర అంగీకారంతో ఏ ఖర్చూ లేకుండా సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించేందుకు ఈ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో పాకాల చంద్రశేఖర్, మంతెన రాజశేఖర్, డాక్టర్ సాంబమూర్తి, మండల పరశురాములు, కొంతం కృష్ణ, రావుల బాలరాజు, ధర్మపురి రాజగోవిందు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

సామాజిక సేవే సంస్థ ప్రధాన లక్ష్యం



సభలో పాల్గొన్న పద్మాక్షి హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

హన్మకొండ కల్చరల్: సామాజిక సేవే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పద్మాక్షి హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో పద్మాక్షి హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఆదివారం సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, సంస్థ లీగల్ సెల్ కమిటీ కన్వీనర్ అనుముల రమేష్, సభ్యులు పాశికంటి జయలక్ష్మి, జ్యోతి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు సంఘటితం కావాలని, సంస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాశికంటి సత్యప్రకాష్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుసుమ అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా 609 సర్వే నంబర్ భూమి

- నిలిచిన చిల్డ్రన్ పార్కు నిర్మాణ పనులు

పరకాల : మాదారం శివారులోని దామెర చెరువు పక్కన ఉన్న 609 సర్వే నంబర్‌లో 19 గుంటల భూమి వివాదాస్పదంగా మారింది. ఓ వైపు చిల్డ్రన్ పార్కు కోసం పనులు చేస్తుండగా తమదేనంటూ వీఆర్ఏలు, వీఆర్ఓలు ఆందోళన చేపడుతున్నారు. పార్కు పనులు నిలిపివేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే, ఆ భూమి తమ తాతలకు సంబంధించిన భూమి అంటూ నేరేళ్ల శంకర్ దంపతులు పట్టాపాస్‌పుస్తకం, పహాణీతో భూమి వద్ద ఆందోళకు దిగారు. అన్యాయంగా తమ భూమిని వీఆర్ఏలు, వీఆర్వోలు ఆక్రమించుకోవడంపై 15 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. తమ తాత నేరేళ్ల నర్సయ్య పేరిటా పాస్‌పుస్తకం, పహాణీ ఉండగా ప్రభుత్వం ఎలా ఆక్రమించుకుంటుందని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. దీంతో చిల్డ్రన్ పార్క్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ మట్టి పోసి పనులు నిలిపివేశాడు.



ఆగిపోయిన చిల్డ్రన్ పార్కు నిర్మాణ పనులు

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- ఆ ఫోరం జిల్లా కార్యదర్శి సదానందం

ఆత్మకూరు: ఉద్యమకారులకు ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శి ఇర్సడ్ల సదానందం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రచురించినట్లు ఉద్యమకారులకు 250గజాల ఇంటిస్థలం, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నప్పటికీ కేబినెట్‌లో చర్చించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంతో మంది తెలంగాణ ఉద్యమకారులు ప్రాణాలను లెక్కచేయకుండా ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో భాగస్వాములయ్యారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు బాబుమియా, ప్రధాన కార్యదర్శి రాజయ్య, మాజీ సర్పంచ్ సామెల్, తెలంగాణ ఉద్యమకారులు జనార్దన్‌రెడ్డి, రాజు, గణపతి, నర్సయ్య, స్వామి, పైడి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదానందం

వ్యక్తిపై కేసు

వేలేరు : మహిళను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీర సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఓ గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన మురావత్ రమణ వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.